RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 398 | 10 బుధవారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

మొహబ్బత్ కీ దుకాన్ కాస్త హిట్లర్ కా మకాన్‌గా మారింది..

అయినా మౌనమెందుకు..

: రాహుల్ గాంధీని ప్రశ్నించిన కేటీఆర్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఢిల్లీలో ఇచ్చే జాతీయ నినాదమైన 'మొహబ్బత్ కీ దుకాన్ కాస్తా.. క్రూర నియంత వారసత్వాన్ని సీఎం రేవంత్ అకున చేర్చుకోవడంతో తెలంగాణలో 'హిట్లర్ కా మకాన్' (హిట్లర్ ఇల్లు)గా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి హిట్లర్ వ్యాఖ్యల నేపథ్యంలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తన సిద్ధాంతాల ముసుగును తొలగించి, అధికారికంగా తన పేరును ఆలిండియా నాజీ పార్టీగా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు.హైదరాబాద్ వార్తలు కాంగ్రెస్ నైతికతలోని ద్వంద్వ ప్రమాణాలను సోమవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ తీవ్రంగా ఆక్షేపించారు. 'ఢిల్లీలో కూర్చొని మిమ్మల్ని మీరు రాజ్యాంగ రక్షకుడిగా ప్రకటించుకొంటూ తిరగడం.. మీరే స్వయం గా నియమించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రక్తపిపాసి అయిన అడాల్ఫ్ హిట్లర్‌ను బహిరంగంగా కీర్తిస్తూ, అతని 'హత్యల దళాన్ని' (అసాసినేషన్ స్క్వాడ్స్) తన పాలనా స్ఫూర్తిగా చెప్పుకొంటుంటే చూస్తూ మౌనంగా ఉండటమేంటి?' అని ప్రశ్నించారు. ఇది కేవలం ఫాసిస్ట్ (నియంతృత్వ) పరిపాలనా మానసిక స్థితికి నిదర్శనం మాత్రమే కాదని, మన దేశ పునాది విలువలపై జరిగిన క్షమించరాని దాడిగా అభివర్ణించారు.తాజా తెలుగు వార్తలు'నియంతృత్వ పద్ధతులను అభినందించడం, స్థానిక కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధప్రాంతాల విధ్వంసంతో గర్వంగా పోల్చుకోవడమే మీ పార్టీ అసలైన పరిపాలనా విధానమైతే.. ఏఐసీసీ తన భావజాల ముసుగును తొలగించి, తన పేరును అధికారికంగా 'ఆలిండియా నాజీ పార్టీ'గా మార్చుకోవాలి' అని కేటీఆర్ సూచించారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణిని రాహుల్‌గాంధీ మౌనంగా

సమర్థిస్తున్నారని, దీనిని దేశమంతా గమనిస్తున్నదని పేర్కొన్నారు. హిట్లర్ సిద్ధాంతాలతో సీఎం రేవంత్ పోల్చుకోవడంపై రాహుల్ సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

హైదరాబాద్ లో భారీ వర్షం...

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

- తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ
- ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

చౌటుప్పల్‌లో భవన నిర్మాణ కార్మికుల నిరసన ర్యాలీ

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల భవన నిర్మాణ కార్మికుల సమ్మె మంగళవారం 4వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక పట్టణ కేంద్రంలోని హైవేపై భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేశారు. ఈ ర్యాలీకు వివిధ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ.5 వేల రూపాయలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికులకి ఈఎస్ఐ కార్డు సదుపాయం కల్పించాలన్నారు. అంతేకాకుండా ప్రమాదవశాత్తు మరణించినచో రూ.20 లక్షలు, అంగవైకల్యం కలిగితే రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలన్నారు. సంక్షేమ బోర్డు కార్డు ఉన్న ప్రతి కార్మికుడు సహజ మరణం పొందితే వారికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.కార్మికుల ఇంట్లో కుమార్తె వివాహానికి రూ.లక్ష అందించాలన్నారు. ప్రసూతి సమయంలో రూ.60 వేలు చెల్లించాలన్నారు. సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణను ఎత్తివేసి ప్రభుత్వమే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు బొల్లమోని రాములు, నరసింహ, సుక్క యాదయ్య, ఎర్నం శ్రీనివాస్, నెలికంటి నరసింహ, కలకుంట్ల శివకుమార్, వెంకటయ్య చీమ కండ్ల శ్రీరాములు, మదారి మార్క్, సదానందం, నరసింహ, శ్రీను, జువ్వి యాదయ్య, లింగస్వామి, రేఖ మల్లయ్య, ఉబ్బు యాదయ్య, జాజుల భిక్షపతి, గజ్జల రాజు పాల్గొన్నారు.

దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

: రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్-2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

: రాంచందర్ రావు

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.

స్కూళ్ల కుదింపు..

రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు

- తెలంగాణలో స్కూళ్ల కుదింపుపై మొదలైన రాజకీయ దుమారం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయంపై బీఆర్ఎస్ నేత కవిత ఫైర్
- 27,000 పాఠశాలలను 4,000గా మార్చడం దారుణమన్న కవిత
- ఈ నిర్ణయం పేద, బాలికల విద్యకు గొడ్డలిపెట్టని విమర్శ
- గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై సమీక్షించలేదని ఆరోపణ

మేము 18 గంటలు కష్టపడుతుంటే.. హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు

: భట్టి విక్రమార్క

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

తాటి చెట్టు పైనే గీతా కార్మికుడు మృతి

హైదరాబాద్ ఎస్టేట్ మద్ధిరాల (ప్రతినిధి)

మద్ధిరాల మండల కేంద్రంలో చామకూరి వెంకన్న ఆలియాస్ (కోడిగుడ్డు వెంకన్న) వయసు 50 సంవత్సరాలు రోజువారీగా కల్లుగీస్తున్న క్రమంలో మంగళవారం ఉదయం కల్లు తేవడానికి తాటిచెట్టు దగ్గరికి వెళ్లి తాటి చెట్టు ఎక్కిన క్రమంలో ముస్తాదు జారీ కిందికి వేలాడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందడం జరిగినదని తెలియజేశారు అతని మరణ వార్త విన్న ప్రజలు భావోద్వేగాలకు గురయ్యారు మృతుడికి ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉన్నారు.భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి గవర్నమెంట్ హాస్పటల్ పంపి పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకు అప్పజెప్పడం జరిగినదని స్థానిక ఎస్సై ఎం వీరన్న తెలిపారు.

ఆడబిడ్డలకు అండగా ఉంటాం...సి ఎం రేవంత్

హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)

మండల కేంద్రం నుండి పరేడ్ గ్రౌండ్లో జరిగే ఇందిరా మహిళా శక్తి సభకు భారీగా బయలుదేరడం జరిగినది. అనంతరం మహిళలు మాట్లాడుతూ ఆడబిడ్డలకు అండగా రేవంత్ ప్రభుత్వం ఉంటుంది అని ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆడబిడ్డలకు అన్యాయం చేయనని చెప్పిన ఏకైక సీఎం ఒక రేవంత్ అని వారు అన్నారు సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తూ మహిళలను ఆర్థికంగా ఎదిగేటట్లు ప్రోత్సహిస్తున్న రాష్ట్రానికి మా వంతు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని వారన్నారు ఈ కార్యక్రమంలో మండల లోని వివిధ గ్రామాల నుంచి మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎంలు వివోఏలు మహిళా సంఘం అధ్యక్షులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లే కుదింపు.. రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర విమర్శలు

రాష్ట్రంలో ఉన్న 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని టీఆర్ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వపు ఈ నిర్ణయం పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉందని ఆమె ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో కవిత ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నిర్ణయం అత్యంత దారుణమని ఆమె అభివర్ణించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా, కనీసం సమీక్ష కూడా నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పాఠశాలలు మూసివేతపై దృష్టి సారించడాన్ని ఆమె విమర్శించారు. విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని ఆయన గణాంకాలను వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, వాటిపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలతో రాష్ట్రం విద్యా రంగంపై చర్చ మరోసారి తీవ్రస్థాయికి చేరింది. కవిత చేసిన ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ...

మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

మధ్యప్రదేశ్ రాజ్యసభ ద్వివార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ తరఫున ఏకైక అభ్యర్థిగా బరిలో ఉన్న మీనాక్షి నటరాజన్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మంగళవారం తిరస్కరించారు. తెలంగాణ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఒక కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆమె ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారంటూ బీజేపీ లేవనెత్తిన అభ్యంతరంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఒక పిటిషన్ దాఖలైంది. లైంగిక వేధింపులు, ప్రాణహాని బెదిరింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మీనాక్షి రాజకీయ అండదండలు అందించారని ఎ.శ్రీలత అనే మాజీ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ విషయాన్ని నామినేషన్‌లో ప్రస్తావించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ నేత ఉమంగ్ సింఘార్ "బలవంతపు రాజకీయాలు"గా అభివర్ణించారు. మీనాక్షిపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నుంచి నోటీసు మాత్రమే అందిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కేసు నమోదైతేనే వివరాలు వెల్లడించాలి తప్ప, నోటీసుకు కాదని వాదించారు. ఇదంతా తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు చేస్తున్న రాజకీయ కుట్ర అని మీనాక్షి నటరాజన్ అన్నారు. "ఒక గాంధేయవాద మహిళను చూసి బీజేపీ భయపడుతోంది" అని ఉమంగ్ సింఘార్ ఎక్స్ వేదికగా విమర్శించారు. "వారి నినాదం 'నారీ వందన్', కానీ నైజం 'నారీ అపమాన్'.. ఇదే బీజేపీ అసలు స్వరూపం" అని దుయ్యబట్టారు. సత్యం, రాజ్యాంగం, ప్రజాభిప్రాయం శక్తితో తాము విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా కొనసాగుతుండడం తెలిసిందే.

రాష్ట్ర ఆర్థిక సంక్షోభానికి బి ఆర్ ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత

హైదరాబాద్ ఎస్టేట్ 09 జూన్ మంచిర్యాల

రాష్ట్రంలో నేడు కనిపిస్తున్న ఆర్థిక ఒత్తిడికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత కాదని, గత పదేళ్ల బి ఆర్ యస్ ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ , నిన్న మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సమావేశంలో క్యాతనపల్లి ఆర్ఓబి నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల అంశంపై ఒక కాంట్రాక్టర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఏకపక్షంగా ఉన్నాయని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. క్యాతనపల్లి ఆర్ఓబి పనులకు 2018 ఆగస్టులో అప్పటి బి ఆర్ యస్ ప్రభుత్వ హయాంలో టెండర్ పిలవబడిందని, 2019లో భూసేకరణ పూర్తిచేసి కాంట్రాక్టర్‌కు పనుల స్థలం అప్పగించారని గుర్తు చేశారు. రెండు సంవత్సరాల్లో పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టు 2021 నాటికే ప్రజలకు అందుబాటులోకి రావాల్సి ఉండగా, 2023 వరకు కూడా పూర్తికాకపోవడం వెనుక ఉన్న కారణాలను అప్పటి పాలకులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్న సంఘటనలు చోటు చేసుకున్నాయని, ప్రమాదాలు, ప్రాణనష్టాలు సంభవించాయని పేర్కొన్నారు. ప్రజలు ఇన్ని సంవత్సరాలు ఇబ్బందులు పడుతున్నప్పుడు అధికారంలో ఉన్న బి ఆర్ యస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 2023లో చెన్నూరు ప్రజలు గడ్డం వివేక్ వెంకటస్వామి ని ఎమ్మెల్యేగా ఎన్నుకున్న తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఆర్ఓబి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, ల్యాండ్ లూజర్స్ సమస్యలను పరిష్కరించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి, పెండింగ్ అంశాలను క్లియర్ చేయడం ద్వారా పనులు వేగంగా పూర్తి చేయించారని తెలిపారు. నేడు ఆర్ఓబి ద్వారా వేలాది మంది ప్రజలు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని, దీనికి మంత్రి వివేక్ చొరవ, పట్టుదల ప్రధాన కారణమని స్పష్టం చేశారు. బిల్లుల చెల్లింపుల విషయానికి వస్తే, మంత్రి ఫైనాన్స్ శాఖకు కన్సెంట్ లెటర్ ఇచ్చారని కాంట్రాక్టర్ స్వయంగా చెప్పడం గమనార్హమన్నారు. అంటే బిల్లుల చెల్లింపుల కోసం మంత్రి కృషి చేశారనే విషయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బిల్లుల కోసం ప్రయత్నించిన నాయకుడిపైనే ఆరోపణలు చేయడం రాజకీయ ఉద్దేశాలతో చేస్తున్న ప్రచారంగా ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. అనాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో భారీ అప్పులు చేసి రాష్ట్రాన్ని లక్షల కోట్ల రూపాయల అప్పుల భారంలోకి నెట్టారని విమర్శించారు. వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టులు చేపట్టినా, అనేక పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని, కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఆలస్యమైన సందర్భాలు, డిఏ బకాయిలు,పిఆర్సీ సమస్యలు, సీపీయస్ అంశాలపై ఉద్యోగులు చేసిన ఆందోళనలు రాష్ట్ర ప్రజలకు ఇంకా గుర్తున్నాయని తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం వల్లే నేడు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు గత ప్రభుత్వ అప్పులపై వడ్డీలు చెల్లిస్తూ, మరోవైపు రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అదే సమయంలో కాంట్రాక్టర్ల పెండింగ్ సమస్యలు, అభివృద్ధి పనుల బిల్లులు, ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. క్యాతనపల్లి ఆర్ఓబి విషయంలో వాస్తవాలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు మానుకోవాలని, ప్రజలు ప్రచారాన్ని కాదు, పనితీరును చూస్తారని, క్యాతనపల్లి ఆర్ఓబి నేడు ప్రజలకు అందుబాటులో ఉండటం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కృషికి నిదర్శనమని వొడ్నాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు సృజన, ప్రధాన కార్యదర్శి మేకల సురేందర్, ఏల్పుల సత్యనారాయణ, కార్యదర్శులు పైడాకుల శ్రీనివాస్, బైర మల్లేష్ , నాయకులు జోగుల వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, ఇబ్రహీం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల మందు పంపిణీలో బజరంగ్ సేన

హైదరాబాద్, జూన్ 09: హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బతిని గౌడ్ కుటుంబం నిర్వహించిన వార్షిక చేపల మందు పంపిణీ కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ ప్రతినిధులు పాల్గొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆర్. లక్ష్మణ రావు, నగర అధ్యక్షుడు మనోజ్ మొగల్గిద్ది పాల్గొని దేశవ్యాప్తంగా వచ్చిన రోగులకు స్వయంగా సాంప్రదాయ చేపల మందును అందించారు.

ఆతిథ్యానికి మరియు ఆప్యాయతకు చిహ్నంగా, ఈ కార్యక్రమానికి హాజరైన రోగులందరికీ టొమాటో బాత్ పంపిణీ చేశారు. ఈ గొప్ప సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతున్నందుకు నాయకులు బతిని గౌడ్ కుటుంబాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉన్న రోగులు, భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు. మన సమాజాలకు సేవ చేస్తూ, వాటిని బలోపేతం చేసే సాంప్రదాయ పద్ధతులను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా రామేశ్వర్ మిశ్రా, కొండారెడ్డి, శ్రీనివాస్ హాజరై కార్యక్రమానికి తమ మద్దతును అందించారు.

ఈ విశిష్టమైన వార్షిక కార్యక్రమంపై కొనసాగుతున్న నమ్మకానికి, విశ్వాసానికి నిదర్శనంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

హైదరాబాద్ లో భారీ వర్షం... ఏలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే గుణాత్మక విద్య

ప్రభుత్వ పాఠశాలలోనే గుణాత్మక విద్య అందుతుందని మహా ముత్తారం మండలము స్తంభం పల్లి గ్రామ సర్పంచ్ జంగిడి కీర్తన శ్రీనివాస్ అన్నారు. ములుగు పల్లి ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమం లో భాగంగా స్తంభం పల్లి (పి పీ)లో బడి బాట కరపత్రాలు గ్రామం లోని తల్లి దండ్రులకు అందచేసి ర్యాలీ నిర్వహించారు.సర్పంచ్ కీర్తన శ్రీనివాస్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనూ ఉండాలని ములుగు పల్లి ఉన్నత పాఠశాలలో అంకితభావం అనుభవం గల ఉపాధ్యాయులచే విద్యాబోధన కొనసాగుతుందని రుచికరమైన మధ్యాహ్న భోజనం వారానికి మూడు కోడిగుడ్లు రాగి జావా పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు రెండు జతల యూనిఫామ్స్ బాలబాలికలకు ప్రత్యేకమైన పరిశుభ్రమైన మరుగుదొడ్లు పాఠశాల వ్యాయామ విద్య ,సైన్స్ క్లబ్ ప్రయోగాల ద్వారా విద్యాబోధన సాగుతోంది అని ఇక్కడి గ్రామం లో అయిదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులు ఆరో తరగతికి ములుగు పల్లి ఉన్నత పాఠశాలకు వచ్చేలా కృషి చేస్తా నని అన్నారు.బయాలజీ టీచర్ కామిడి సతీశ్ రెడ్డి మాట్లాడుతూ ములుగు పల్లి లో టెన్త్ ఫలితాలలో అందరు ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో టాపర్ గా నిలిచారని అన్నారు

ప్రభుత్వ పాఠశాలలకు గ్రామాల్లోని పిల్లలను పంపడం మీ బాధ్యతగా భావించి పంపాలని వారిని ఉన్నతమైన ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తమదేనని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోడేటి వెంకటేష్ స్తంభం పల్లి యూత్ నాయకులు పసుల రామ్ ,జాడి అజయ్ , చరణ్ ,పసుల రాజ్ కుమార్,రాజేంద్ర ప్రసాద్,సూడిది ప్రవీణ్,పసుల రమేష్ రామ్ చరణ్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి లక్షణం.. ప్రజల పక్షం
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

టీ – సేవ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 09: టీ – సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, సిటీ నుండి అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుటీ –సేవ సెంటర్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. క్రొత్త పాన్ కార్డులు అప్లై, కరెక్షన్ చేయవచ్చు, బస్సు, ట్రైన్, విమాన టికెట్స్ బుకింగ్స్, బ్యాంకు మనీ ట్రాన్స్ ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, కాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ & కార్ ఇన్సూరెన్స్, బిల్లుల చెల్లింపులు, 1000 కి పైగా కేంద్రప్రభుత్వ సంస్థ ఆమోదిత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణా తరగతుల కు నమోదు కేంద్రం , 500 కి పైగా కేంద్రప్రభుత్వ సంస్థ ఆమోదిత స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్ కొరకు నమోదు కేంద్రం , టీ – సేవ ప్రతి సంవత్సరం టీ – సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ద్వారా 15 లక్షలకు పైగా విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు 1000కి పైగా ఉపాధి అవకాశాలు గల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించనుంది. ఆన్ లైన్ సేవలు వినియోగదారులకు అందించడంతో పాటు ఆన్లైన్ లో వివిధ సేవలను అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందే వీలుంది. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.tsevaonline.com
ఫోన్: 8179955744.

అమ్మా... నీకు నేను ముఖ్యమా, ఆఫీసు ముఖ్యమా?

కొడుకు ప్రశ్నతో చలించిపోయిన హైదరాబాద్ మహిళ!



“అమ్మా, నీకు నేను ముఖ్యమా? లేక నీ ఆఫీసా?“ అంటూ ఓ ఏడేళ్ల బాలుడు తన తల్లిని అడిగిన ప్రశ్న ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఉద్యోగాలు చేసే తల్లులు ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణకు, పని-జీవిత సమతుల్యత సవాళ్లకు ఈ ఘటన అద్దం పడుతోంది. ఎందరో తల్లిదండ్రులను ఈ ఉదంతం కదిలిస్తోంది.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌కు చెందిన లావణ్య అనే మహిళ తన ఏడేళ్ల కొడుకుతో జరిగిన సంభాషణను ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో రూపంలో పంచుకున్నారు. ఒకరోజు ఉదయం ఆమె కొడుకు, స్కూల్ నుంచి వచ్చాక ఇద్దరం కలిసి గ్రీటింగ్ కార్డ్ చేద్దామని అడిగాడు. అందుకు ఆమె సరేనని చెప్పి ఆఫీసుకు వెళ్లారు. కానీ, పని ఒత్తిడి వల్ల ఇంటికి రావడం ఆలస్యమైంది. అప్పటికే ఆ బాలుడు తల్లి కోసం ఎదురుచూసి దిగాలుగా ఉన్నాడు.ఏమైందని తల్లి అడగ్గా, “నీకు నేను ముఖ్యమా లేక నీ ఆఫీసా?“ అని సూటిగా ప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు లావణ్య ఒక్కసారిగా అవాక్కయ్యారు. వెంటనే తేరుకుని, తనకు కొడుకే ముఖ్యమని చెప్పి దగ్గరకు తీసుకున్నారు. ఆ తర్వాత, నిద్రపోయే ముందు తన ఉద్యోగ బాధ్యతలను వివరిస్తూనే, తన జీవితంలో వాడి స్థానం ఏంటో అర్థమయ్యేలా చెప్పారు. ఈ సంభాషణ తర్వాత తన కొడుకులో మార్పు వచ్చిందని, తను ఆలస్యంగా ఇంటికి వస్తే “అమ్మా అలిసిపోయావా?, నీళ్లు కావాలా?“ అంటూ అడగడం మొదలుపెట్టాడని లావణ్య తెలిపారు. “రోజు చివరికి పిల్లలకు కావాల్సింది మన సమక్షమే కానీ, మన బహుమతులు కావు“ అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఈ పోస్ట్ చూసిన ఎందరో ఉద్యోగాలు చేసే తల్లులు తమ అనుభవాలను పంచుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రతీ వర్కింగ్ మదర్ మనసులో ఉండే ప్రశ్నే ఇదని, పిల్లలతో ఇలాంటి విషయాలపై మాట్లాడటం ఎంతో అవసరమని అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన హైదరాబాద్ వంటి నగరాల్లోని కార్పొరేట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఒత్తిళ్లను మరోసారి ముందుకు తెచ్చింది.

ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది: లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా

హైదరాబాద్, జూన్ 9: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా పేర్కొంది. ఈ మేరకు పార్టీ నాయకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రకటనలో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే మార్గాల అభివృద్ధి, విమానాశ్రయాల విస్తరణ, సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిందన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సొరంగ మార్గాలు, వంతెనల నిర్మాణం ద్వారా సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేశారని పేర్కొన్నారు.జమ్మూ కాశ్మీర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే “మేక్ ఇన్ ఇండియా“, “స్టార్ట్ అప్ ఇండియా“ వంటి కార్యక్రమాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని, దేశ పారిశ్రామిక రంగానికి కొత్త ఊపు లభించిందన్నారు.అన్ని రాష్ట్రాల్లో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ సమస్య పరిష్కారంలో తీసుకున్న చర్యలు చారిత్రాత్మకమని, దేశ సమైక్యతను మరింత బలపరిచాయని అభిప్రాయపడ్డారు.
అలాగే అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం ద్వారా కోట్లాది మంది భారతీయుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని, దేశ ప్రజల విశ్వాసాన్ని గౌరవించే విధంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా కొనియాడింది.దేశాభివృద్ధి, జాతీయ భద్రత, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని పార్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి

-కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ జూన్ 09:
హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.
ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని,ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, పి. సంతోష్ కుమార్, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

“విద్య భిక్ష కాదు రాజ్యాంగం కల్పించిన హక్కు- విద్యార్థుల భవిష్యత్తు కోసం హయత్‌నగర్‌లో సోషల్ జస్టిస్ పార్టీ పోరుదీక్ష

– జీవో నెం.7 రద్దు చేయాలి... పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య కల్పించాలి రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి అల్టిమేటం

– “విద్య భిక్ష కాదు ప్రతి పేద విద్యార్థి హక్కు” అంటూ హయత్‌నగర్‌లో సోషల్ జస్టిస్ పార్టీ పోరుదీక్ష.
– ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్.
– రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆందోళనకారుల విజ్ఞప్తి.
– విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు.
– “విద్య కోసం పోరాటం ఆగదు” అంటూ రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సోషల్ జస్టిస్ పార్టీ హెచ్చరిక.

విద్య అనేది దానం కాదు... ప్రభుత్వాలు చేసే ఉపకారం కాదు... భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కు అని నినదిస్తూ సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిర్వహించిన “విద్యార్థి రక్షణ దీక్ష“ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పోరుదీక్షలో పార్టీ నాయకులు ప్రభుత్వ విద్యా విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.
ప్రస్తుతం రాష్ట్రంలో వేలాది మంది పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరమవుతున్నారని, విద్య హక్కును అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
దీక్షలో మాట్లాడిన నాయకులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల పెత్తనం కారణంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.
అలాగే విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
జీవో నెంబర్-7ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా సోషల్ జస్టిస్ పార్టీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధానాలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కె.వి. గౌడ్, అధికార ప్రతినిధి చింతల విజయ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఏర్పుల బాలస్వామి, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ మహర్షి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ఎల్లయ్య, హైద్రా ఏరియా ఇంచార్జ్ వరంగల్ రమేష్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఇంచార్జ్ రాపాక వెంకట్, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాముల ప్రదీప్, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.
ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, పేద విద్యార్థులకు విద్య అందించడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని అన్నారు. విద్య హక్కును కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సమాజ భవిష్యత్తును నిర్లక్ష్యం చేసినట్టేనని పేర్కొన్నారు.
తెలంగాణ ఉద్యమకారుడు, విశ్వంబర పత్రిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. విద్య ద్వారా మాత్రమే సామాజిక మార్పు సాధ్యమని, అందుకే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని సోషల్ జస్టిస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి చక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

సంపాదన, త్యాగం, మరియు ఒంటరితనం

: భారతీయ వృద్ధాప్య జీవితంలోని ఒక నిశ్శబ్ద విషాదం

: అనేక కుటుంబాలకు ఎదురవుతున్న ఇది కథ కాదు పచ్చి నిజం

భారతీయ కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రుల స్థానం ఒకప్పుడు అలయం లాంటిది. వారు కేవలం జన్మనిచ్చినవారు మాత్రమే కాదు; బతుకుకు బాట వేసినవారు, భవిష్యత్తుకు బీజం నాటినవారు, పిల్లల చిరునవ్వుల వెనుక దాగిన అగ్ని. వారు తమ జీవితాన్ని తాము కోసం కాక, తమ సంతానం కోసం ఖర్చు చేశారు. తమ ఆకాంక్షలను కుదించుకున్నారు. తమ కోరికలను వాయిదా వేశారు. తమ సుఖాన్ని త్యాగంగా మార్చుకున్నారు. ఆ త్యాగమే వారి ఆత్మగౌరవం. ఆ త్యాగమే వారి జీవనాధారం.

సారవంతం కాని కాలంలో పుట్టిన ఆ తరం, ఎఫ్ఐటీఎఫ్ఎతో పెరిగింది; సంపదతో కాదు, కొరతతో మలచబడింది. రేషన్ కార్డు, పొదుపు, క్రమశిక్షణ, ఉద్యోగ భద్రత, చిన్నపాటి సౌకర్యాలకూ సంయమనంఇవే వారి జీవితానికి మూలసూత్రాలు. ఒక ఫోన్ కనెక్షన్ కోసం సంవత్సరాలు ఎదురు చూసిన మనుషులు వారు. ఒక చిన్న ఉద్యోగ స్థిరత్వం లభించడమే గొప్ప విజయంగా భావించిన మనుషులు వారు. చేతిలో ఉన్న రూపాయిని వెంటనే ఖర్చు చేయకుండా దాచిపెట్టడమే బుద్ధిగా, గౌరవంగా, భద్రంగా అనిపించిన యుగం వారిది.

అలాంటి తల్లిదండ్రులు జీవితమంతా ఒకే దిశలో నడిచారుపిల్లల కోసం. బట్టలు చిరిగేవరకు వాడారు. అవసరమైన ప్రయాణాలను కూడా వాయిదా వేశారు. ఆటో రిక్షా ఖర్చు ఆదా చేయడానికి నడిచారు. వర్షంలో తడిచినా, ఎండలో కాలినప్పటికీ, "మనం తట్టుకోవాలి" అన్న ధైర్యంతో జీవించారు. పిల్లల చదువుల కోసం, ××ం కోచింగ్‌ల కోసం, ప్రొఫెషనల్ కోర్సుల కోసం, విదేశీ విద్య కోసం తమ కలలను తాకట్టు పెట్టారు. వారి వ్యక్తిగత జీవితం ఒక నిశ్శబ్ద మట్టి గిన్నె లాగా మారింది; బయట నుంచి బలంగా కనిపించినా, లోపల త్యాగాల నీరు నిండి ఉంది.

ఈ శ్రమ, ఈ సంయమనం, ఈ త్యాగాల ఫలితంగా వారు చివరికి కొంత స్థిరత్వాన్ని సంపాదించారు. ఒక ఇల్లు, కొంత బంగారం, కొన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పీపీఎఫ్, మ్యూచువల్ ఫండ్లు, స్థిర చర ఆస్తులుఇలా జీవితపు చివరి దశకు చేరేసరికి ఒక ఆర్థిక భద్రతను నిర్మించుకున్నారు. కానీ మనసు మాత్రం ఇంకా పాత కాలంలోనే ఉంది. వారికి డబ్బు ఉన్నా, ఖర్చు చేయాలన్న ధైర్యం లేదు. సౌకర్యం ఉన్నా, ఆ సౌకర్యాన్ని అనుభవించాలన్న అలవాటు లేదు. ఏసీ నడపడం కూడా వృథా అనిపిస్తుంది. అవసరమైన వైద్య చికిత్స కూడా ఖరీదైనదనిపిస్తుంది. ప్రయాణం కూడా ఆడంబరంగా అనిపిస్తుంది. ఫలితంగా, వారు సంపన్నులైనా, జీవనానికి దూరమవుతారు.

ఈ మనస్తత్వం కేవలం పొదుపు అలవాటు మాత్రమే కాదు; అది ఒక మొత్తం తరం మెదడులో నాటుకుపోయిన భయం. "ఇప్పుడే ఖర్చు పెడితే రేపు ఏం?" అనే ప్రశ్న వారి మనసులో ఎప్పుడూ మోగుతూనే ఉంటుంది. ద్రవ్యోల్బణం, అనారోగ్యం, అనిశ్చితి, ఆయుష్షు, ఆధారపడే అవసరంఇవన్నీ వారి మనసులో పెద్ద పెద్ద నీడలుగా నిలుస్తాయి. అందుకే రిటైర్మెంట్ వచ్చినా వారి మనసు విశ్రాంతిని అంగీకరించదు. ఆనందాన్ని కూడా భద్రత కోణంలోనే కొలుస్తుంది. జీవితమంతా కూడబెట్టిన సంపద, చివరికి వినియోగానికి కాకుండా భయానికి నిలయమవుతుంది.

ఇదే సమయంలో మరొక వేదన ఈ కథను మరింత భారంగా మారుస్తుంది. తమ పిల్లలను ఉన్నత చదువుల పేరిట విదేశాలకు పంపిన ఈ తల్లిదండ్రులు, దానికి వెనుక ఉన్న ఆశల్ని, అంచనాల్ని, త్యాగాల్ని ఎవరూ పూర్తిగా గుర్తించరు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్ఏ దేశమైనా కావచ్చు, అక్కడ మంచి ఉద్యోగం, స్థిర జీవితం, గౌరవం, సౌఖ్యం అనే కలలతో పిల్లలను పంపారు. తమ జీవిత శ్రమను దాచిన గూడు నుంచి బయటకు తీసి, పిల్లల భవిష్యత్తుగా మార్చారు. కానీ కాలక్రమంలో ఆ పిల్లల జీవితం వేరే దారిలో పరవశించింది. కొత్త దేశం, కొత్త సంస్కృతి, కొత్త జీతం, కొత్త ఇల్లు, కొత్త కుటుంబం, కొత్త బాధ్యతలుఇవన్నీ వారిని తమ మూలాల నుంచి దూరం చేశాయి.

దూరం కేవలం భౌగోళికం కాదు; అది భావోద్వేగ పరమైన వేరుపాటు.
మొదట ఫోన్ కాల్స్ తగ్గుతాయి.
తర్వాత పండగలకు మాత్రమే గుర్తు వస్తారు.
ఆపై వీడియో కాల్‌తో సరిపెడతారు.
తర్వాత "వాళ్లని చూసుకుంటున్నారు కదా" అనే నిర్లక్ష్యపు ఊరట.
చివరికి తల్లిదండ్రులు క్రమంగా ప్రాధాన్య జాబితాలో చివరికి దిగజారిపోతారు.

వృద్ధాప్యంలో డబ్బు కంటే అవసరం ఉండేది తోడు.
మందు సమయానికి గుర్తు చేసే మనిషి.
డాక్టర్ దగ్గరకు వెంట వెళ్లే మనిషి.
ఒంటరితనంలో ఒక మాట చెప్పే మనిషి.
జ్వరం వచ్చినప్పుడు ఒక గ్లాసు నీళ్లు అందించే మనిషి.
కానీ విదేశాల్లో స్థిరపడిన పిల్లల వల్ల ఈ సహజానుభూతులన్నీ వీడియో స్క్రీన్‌లకు పరిమితమవుతాయి. తెరపై నవ్వులు ఉంటాయి; గదిలో మాత్రం మౌనం ఉంటుంది. మాటలు ఉంటాయి; స్పర్శ ఉండదు. డబ్బు ఉంటుంది; తోడు ఉండదు. ఇదే వృద్ధాప్యంలోని అత్యంత గాఢమైన ఒంటరితనం.

ఇంకొక గమనించదగ్గ వాస్తవం ఏమిటంటే, భారతదేశంలో ఉన్న తండ్రి స్థిరచర ఆస్తుల పట్ల పిల్లలు చాలాసార్లు ఆసక్తి చూపరు. వాటిని చూసుకోవడం, నిర్వహించడం, పత్రాలు సరిచేయడం, పన్నులు చెల్లించడం, అద్దె ఆదాయం పర్యవేక్షించడం, భూమి లేదా ఇంటి వ్యవహారాలను గమనించడంఇవన్నీ వారికి భారంలా అనిపించవచ్చు. కానీ ఆ ఆస్తుల వెనుక ఒక తరం శ్రమ దాగి ఉంది. ఒక ఇల్లు, ఒక ప్లాట్, కొంత భూమి, కొంత బంగారం, కొంత నగదుఇవన్నీ పుస్తకాల్లోని ఆస్తులు మాత్రమే కావు; అవి తల్లిదండ్రుల నిద్రలేని రాత్రుల జ్ఞాపకాలు. అవి వారి త్యాగానికి భౌతిక రూపాలు.

కానీ బాధ ఏమిటంటే, ఈ ఆస్తులు పిల్లలకు కేవలం వారసత్వ హక్కులుగా కనిపిస్తే, తల్లిదండ్రులకు అవి జీవిత కృషి స్మారక చిహ్నాలు. పిల్లలు వాటిని దూరంగా ఉంచితే, పర్యవేక్షణ లేక వదిలేస్తే, చివరికి అవే భారమవుతాయి. కుటుంబ భూమి వివాదాలకు లోనవుతుంది. ఇల్లు నిర్లక్ష్యానికి గురవుతుంది. పత్రాలు అప్డేట్ కాక మిగులుతాయి. నామినేషన్లు పాతబడ్డవిగా మారతాయి. తల్లిదండ్రులు ఉన్నప్పుడే పట్టించుకోని ఆస్తులు, వారి తర్వాత కలహాల కేంద్రాలుగా మారతాయి.

ఇలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రుల నిశ్శబ్ద వేదన మరింత గాఢమవుతుంది. వారు బహిరంగంగా ఫిర్యాదు చేయరు. ఎవరికీ బాధ పెట్టరు. "పిల్లలు బాగా ఉన్నారు" అని చెబుతారు. "వాళ్ల జీవితం వాళ్లదే" అంటారు. "మనం బాగా పెంచాం" అని తమను తాము ఒప్పించుకుంటారు. కానీ ఆ మౌనంలోనే అనేక ప్రశ్నలు దాగి ఉంటాయి. మేము మా జీవితాన్ని మీ కోసం కరిగించాం; మరి మా వృద్ధాప్యంలో మాకు మిగిలిందేమిటి? మేము సంపదను కూడబెట్టాం, కానీ జీవితానందాన్ని ఎందుకు అనుభవించలేకపోయాం? మేము పిల్లల కోసం ప్రపంచాన్ని ఇచ్చాం; కానీ పిల్లల ప్రపంచంలో మాకు స్థానం ఎందుకు తగ్గిపోయింది?

ఆధునికత, వలస, కెరీర్, ప్రపంచీకరణ – ఇవి అన్ని జీవన నియమాలను మార్చాయి. పిల్లలు దేశం దాటి వెళ్లడం తప్పు కాదు. తాము తాము జీవితాన్ని నిర్మించుకోవడం తప్పు కాదు. కానీ తల్లి తండ్రుల పట్ల బాధ్యతను మరిచిపోవడం, వారి అవసరాలను నిర్లక్ష్యం చేయడం, వారి ఒంటరితనాన్ని లెక్కచేయకపోవడం మాత్రం గంభీరమైన నైతిక లోపం.

కుటుంబ బంధం అనేది కేవలం జన్మ సంబంధం కాదు. అది పరస్పర బాధ్యత.
తల్లిదండ్రులు పిల్లల కోసం ఎదురు చూడటం మాత్రమే కాదు; పిల్లలు కూడా తల్లిదండ్రులను గుర్తుపెట్టుకోవాలి.
ఆర్థిక సహాయం మాత్రమే కాదు; భావోద్వేగ హాజరు కూడా కావాలి.

కాలం, శ్రద్ధ, సంభాషణ, గౌరవంఇవే వృద్ధ తల్లిదండ్రులకు నిజమైన ఆస్తి.

చివరికి ఈ మొత్తం కథ ఒక ప్రశ్న వద్ద నిలుస్తుంది:
డబ్బు సంపాదించడమే జీవితం యొక్క లక్ష్యమా?
లేదు.
సంపదను కూడబెట్టడమే గమ్యమా?
లేదు.
అవి జీవితాన్ని సుఖంగా, గౌరవంగా, అర్థవంతంగా జీవించడానికి ఉన్న సాధనాలు మాత్రమే.
తల్లిదండ్రులు తమ జీవితాన్ని పిల్లల కోసం త్యాగం చేశారు.
పిల్లలు తమ జీవితాన్ని నిర్మించుకోవడం అవసరం.
కానీ ఆ నిర్మాణంలో తల్లిదండ్రులను మరిచిపోతే, ఆ విజయం అసంపూర్ణం.
ఆస్తులు ఉన్నా, ఆదరణ లేకపోతే, అది సంపూర్ణ కుటుంబం కాదు.
డబ్బు ఉన్నా, డైలీ ఫోన్ కాల్ లేకపోతే, అది బంధం కాదు.
ఇల్లు ఉన్నా, మనుషుల ఉనికి లేకపోతే, అది గృహం కాదు; అది కేవలం నిర్మాణం.
అందుకే భారతీయ వృద్ధాప్య కథ కేవలం ఆర్థిక కథ కాదు. అది త్యాగాల కథ. ఆశల కథ. దూరాల కథ. మౌనాల కథ. మరియు అంతిమంగా, గుర్తింపునకు అర్హమైన ఒక తరం గురించి రాసిన నిశ్శబ్ద మహాకావ్యం.
ఆ తరం అడిగేది ఎక్కువ కాదు :
కొంచెం ప్రేమ,
కొంచెం తోడు,
కొంచెం గౌరవం,
కొంచెం సమయం.

అంతే.
అంత కంటే గొప్ప సంపద ఇంకొకటి లేదు.

అంగన్వాడి కార్యకర్తలకు శిక్షణ తరగతులు....

స్థానిక గవరపాలెం జీవీఎంసీ జడ్పీహెచ్ స్కూల్ నందు అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఎం.వి రమణకుమారి అధ్యక్షత వహించి 0 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారుల అభివృద్ధి స్థితిని గుర్తించేందుకు చేపట్టనున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఈసిడి (ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్) స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణలో చిన్నారుల శారీరక మానసిక భాషా మరియు సామాజిక అభివృద్ధి అంశాలను ఏఐ సాంకేతికత సహాయంతో గుర్తించే విధానాలపై వారికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేవరకు పిల్లల అభివృద్ధి స్థాయిని సమర్థవంతంగా అంచనా వేసేందుకు అనుసరించాల్సిన విధానాలు,డిజిటల్ సాధనాల వినియోగం, స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల అభివృద్ధిలో ఉన్న లోపాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ హాస్పిటల్ డాక్టర్ పృథ్వి రవీందర్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ఆర్ బి ఎస్ కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) మరియు స్క్రీనింగ్ గురించి అవగాహన కల్పించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి సాంకేతికతను వినియోగించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సూపర్వైజర్లు మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోకి ఎంటరైన 'ట్రంప్ టవర్స్'... లగ్జరీ హౌసింగ్ లో సరికొత్త అధ్యాయం

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఓ సరికొత్త, ప్రతిష్ఠాత్మక అధ్యాయం మొదలైంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'ట్రంప్ టవర్స్' బ్రాండ్ ఇప్పుడు అధికారికంగా భాగ్యనగరంలోకి అడుగుపెట్టింది. రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం పరిధిలోని కోకాపేటలో నిర్మించనున్న ఈ అల్ట్రా లగ్జరీ నివాస ప్రాజెక్టుకు తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (TGRERA) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దీంతో నగరంలో అత్యంత ఖరీదైన, విలాసవంతమైన నివాస సముదాయాల నిర్మాణానికి మార్గం సుగమమైంది. టీజీ రెరా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టును 'ఇరా ది ఎడ్జ్ డెవలపర్స్ ఎల్ఎల్పీ' సంస్థ అభివృద్ధి చేయనుంది. దీనికి ్ర02400010871 నంబర్‌తో రిజిస్ట్రేషన్ లభించింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వెంబడి ఉన్న కోకాపేట "గోల్డెన్ మైల్" ప్రాంతంలో 16,389.76 చదరపు మీటర్ల (సుమారు 4 ఎకరాలు) విస్తీర్ణంలో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. మొత్తం 2,64,580 చదరపు మీటర్ల బిల్ట్-అప్ ఏరియాకు అనుమతులు లభించాయి. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి 2031 మే 15ని గడువుగా నిర్దేశించారు.

ఈ ప్రాజెక్టును ట్రంప్ ఆర్గనైజేషన్ యొక్క భారత అధికారిక భాగస్వామి అయిన 'ట్రైబెకా డెవలపర్స్' మరియు 'ఇరా రియల్టీ' సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఆకాశాన్ని తాకేలా రెండు భారీ టవర్లను (జంట టవర్లు) నిర్మించనున్నారు. కొన్ని నివేదికల ప్రకారం, ఈ టవర్లు 63 అంతస్తులకు పైగా ఉండవచ్చని అంచనా. ప్రధానంగా అత్యంత సంపన్నులను లక్ష్యంగా చేసుకుని 3, 4, 5 బీహెచ్‌కే కాన్ఫిగరేషన్‌లతో కూడిన ప్రీమియం అపార్ట్‌మెంట్లను ఇందులో అందుబాటులోకి తేనున్నారు. సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.ట్రంప్ బ్రాండ్ అనగానే గుర్తొచ్చే ప్రత్యేకమైన డిజైన్, ప్రపంచ స్థాయి సదుపాయాలు ఈ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ప్రైవేట్ ఎలివేటర్లు, రెండు టవర్లను కలిపే స్కై బ్రిడ్జ్‌లు, అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్లబ్‌హౌస్ వంటి ఎన్నో ప్రత్యేకతలు ఇందులో ఉండనున్నాయి. హైదరాబాద్‌లో లగ్జరీ నివాసాలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ ప్రాజెక్ట్ అద్దం పడుతోంది. ఇప్పటికే దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ట్రంప్ టవర్స్ విజయవంతం కాగా, ఇప్పుడు హైదరాబాద్ వంతు వచ్చింది. ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం కోసం త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనయులు డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్ భారత్‌లో పర్యటించే అవకాశాలు ఉన్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, హైదరాబాద్ స్కైలైన్‌లో ఇది ఒక ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌గా నిలిచిపోవడం ఖాయం.

RNI No Tel / 2012 /4241
ప్రతి లక్షణం... ప్రజల పక్షం...
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

దివ్యాంగులకు ట్రై సైకిల్, వీల్ చైర్ అందజేత

– జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు,

పలువురు దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పందించి.. సమస్యకు పరిష్కారం చూపారు.ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన చింతకింది లస్మయ్య, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముద్రకోల దీన దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వారు ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తక్షణమే స్పందించి చింతకింది లస్మయ్య కు మాన్యువల్ ట్రై సైకిల్, ముద్రకోల దీనకు వీల్ చైర్ అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారికి వెంటనే మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో స్పందించి మాన్యువల్ ట్రై సైకిల్, వీల్ చైర్ అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని,

– 10న కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలకు పిలుపు,

వంటగ్యాస్, పెట్రోల్,డీజిల్ ధరలతోపాటు పప్పులు, నూనెలు, కూ రగాయల వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నితాకుతున్నాయని, బీజేపీ పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద 10న ఆందోళనలు చేపట్టాలని ఆయన ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 'అచ్చే దిన్' వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నార ని ఫైర్అయ్యారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న బీజేపీ ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తున్నదని తెలిపారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫ లమైందని చెప్పారు. కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాలలో ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రత్యేక అధికారి సుమలత సోమవారం తెలిపారు. ఏడవ తరగతిలో 10 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ లో 20 సీట్లు, ఎంపీ ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిట్యాల కేజీబీవీ ఐఓఈ గా ఎంపికైనట్లు తెలిపారు. సీఈసీ విద్యార్థులకు న్యాయవాద వృత్తి కోర్సులు లాసెట్, సీఎల్ ఏటీ వంటి పరీక్షలకు శిక్షణ ఇవ్వన్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తయిన బాలికలు, నేరుగా కళాశాలలో అడ్మిషన్ పొందగలరని కోరారు.డబ్ల్యూహెచ్ లో పది సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారి సుమలత

రూ.4 కోట్లకు ఫ్లాట్ అమ్మేసిన టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్

టీమిండియా మాజీ క్రికెటర్, బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ముంబైలోని తన నివాస అపార్ట్‌మెంట్‌ను విక్రయించాడు. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన బాంద్రా వెస్ట్‌లోని ఈ ఫ్లాట్‌ను అగార్కర్ రూ.4 కోట్లకు అమ్మినట్లు ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా వెల్లడైంది.

బాంద్రా రెక్లమేషన్‌లోని జ్యువెల్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఈ అపార్ట్‌మెంట్ ఉంది. 1,229 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో పాటు రెండు కార్ పార్కింగ్ స్లాట్లను కూడా కొనుగోలుదారుకు అప్పగించారు. ఈ లావాదేవీ ఏప్రిల్ 16, 2026న రిజిస్టర్ కాగా, దీని కోసం కొనుగోలుదారు రూ.24 లక్షల స్టాంప్ డ్యూటీ, రూ.30,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించారు. ఈ లెక్కన చదరపు అడుగు ధర సుమారు రూ.32,547గా ఉంది.

ముంబైలో అత్యంత డిమాండ్ ఉన్న నివాస ప్రాంతాల్లో బాంద్రా వెస్ట్ ఒకటి. రోడ్డు, రైలు, మెట్రో మార్గాల ద్వారా బలమైన కనెక్టివిటీ, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ వంటి వ్యాపార కేంద్రాలకు సమీపంలో ఉండటం ఇక్కడ ధరలు అధికంగా ఉండటానికి కారణం. భారత్ తరఫున 1998లో అరంగేట్రం చేసిన అజిత్ అగార్కర్, ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా అన్ని ఫార్మాట్లలో రాణించాడు. ప్రస్తుతం అగార్కర్ బీసీసీఐలో జాతీయ పురుషుల జట్టు చీఫ్ సెలెక్టర్ గా పరిపాలనా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. కాగా, గతవారమే బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కూడా తన రెండు అపార్ట్‌మెంట్లను రూ.7.1 కోట్లకు అమ్మిన విషయం తెలిసిందే.

ప్రజలలో నమ్మకం పెంచే విధంగా పోలీసు విధులను నిర్వర్తించాలి

– సిబ్బంది విధుల పట్ల పర్యవేక్షణ ఉండాలి.

– స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, పెండెన్సీ లేకుండా చూడాలి.

– సిరికొండ పోలీస్ స్టేషన్ పరిశీలన.ఐశ్రీ

– ఉట్నూర్ ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్.

వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లాలోని సిరికొండ పోలీస్ స్టేషన్ను ఉట్నూర్ ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మొదటగా ఎస్ఐ విక్రమ్ పూల మొక్క అందజేసి ఆహ్వానించారు, తదుపరి పోలీస్ స్టేషన్ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. పోలీసు యూనిఫాం గొప్పతనాన్ని తెలియజేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బందికి కేటాయించిన వస్తువులను వారి సర్వీస్ రికార్డులను పరిశీలించారు. తదుపరి ఉట్నూర్ ఎఎస్పి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. మండల పరిధిలో మండల పరిధిలో ప్రజలతో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలని గ్రామాలను సందర్శిస్తూ ఉండాలని తెలిపారు. గంజాయి గుడుంబా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలని గంజాయి వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందనే విషయాన్ని తెలియజేసి చైతన్య పరచాలని సూచించారు. ప్రజలలో పోలీసుల పట్ల ఉన్న గౌరవాన్ని నమ్మకాన్ని పెంచే విధంగా దర్యాప్తులను చేపట్టి, పోలీస్ స్టేషన్ నందు ఎలాంటి పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా సిబ్బందిని కేటాయిస్తూ వారికి శాశ్వత పరిష్కారం చూపించాలి అని తెలిపారు. సిబ్బంది మంచి ప్రవర్తన, క్రమశిక్షణను కలిగి ఉండాలని నిధులలో నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. చిన్న చిన్న నేరాలు జరిగినప్పుడే వాటిని అరికట్టాలని సూచించారు. మహిళల పట్ల వేధింపులపై చిన్నారుల పట్ల జరుగు నేరాలపై బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటిని అరికట్టే దిశగా కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ రౌడీషీటర్లను, సస్పెక్ట్ షీట్లను తరచూ తనిఖీ చేస్తూ ఉండాలని, వారి స్థితిగతులను తెలుసుకుంటూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడా సీఐ సిహెచ్ రమేష్, ఎస్సై విక్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

– గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 26 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ లో అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

నీట్2026 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్,

ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీటి 2026 (NEETUG) ప్రవేశ పరీ క్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమ స్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలె క్టర్ చాహత్ బాజ్పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫ రెన్స్ హాలులో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమీక్షని ర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ అధి కారులతో విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన పరీక్ష అని, అందువల్ల నిర్వహణ లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తగిన బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ వంటి సౌక ర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గదర్శకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష జిల్లా కో ఆర్డినేటర్, నోడల్ అధికారి భిక్షపతి, హనుమకొండ ఏసీపీ సరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఈడీఎం శ్రీధర్, సంబంధిత శాఖల అధి కారులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

– ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు,

మొగుళ్లపల్లి మండల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలప ల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణరావు అన్నారు. ప్రజా పా లన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ లైన్లు, ట్రాన్స్ఫార్మర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించిన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలు చేస్తున్నటిఫిన్, మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యాల గురించి వివరించారు. సాదా బైనామా భూములకు చట్టబద్ధ హ క్కులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత..గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతఇస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే జీఎస్ఆర్ మండలంలోని అందుకు తండలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందుకు తండాలో తాగునీరు, రోడ్లు, సైడ్ డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. మహిళా సంఘ భవనం, అంగన్వాడీ భవనం, నిర్మాణాన్ని మంజూరు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రైతులకు పంటల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ, పంట అవశేషాలను కాల్చకుండా భూమి సారాన్ని పెంపొందించే పద్ధతులను వివరించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈకార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in

నేను ఎప్పుడో హీరోగా చేశా: తమన్

టాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ తన తోటి సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ హీరోగా మారడంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తన 'ఓజీ టూర్' కాన్సర్ట్ సందర్భంగా మీడియాతో ముచ్చటించిన తమన్... తనదైన శైలిలో పంచ్‌లు వేస్తూ నెటిజన్లను, అభిమానులను ఎంతగానో నవ్వించారు.మీడియా ప్రతినిధులు తమన్‌ను ఉద్దేశించి.. "దేవిశ్రీ ప్రసాద్ హీరో అయ్యాడు. మీరు ఎప్పుడు హీరోగా నటిస్తారు?" అని ప్రశ్నించగా... ఆయన చాలా చాకచక్యంగా, సరదాగా సమాధానమిచ్చారు. "నేను ఎప్పుడో హీరోగా చేసేశాను. ఇప్పుడు దేవి వంతు వచ్చింది, తను హీరో అవుతున్నాడు. అయినా, ఆ విషయాలు మనకెందుకు?" అంటూ నవ్వేశారు. 2003లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'బాయ్స్' సినిమాలో తమన్ ఒక హీరోగా నటించిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.నటనకు, సంగీత దర్శకత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని చెప్తూ తమన్ కొన్ని ఫన్నీ కామెంట్స్ చేశారు. "యాక్టింగ్ చేయడం చాలా కష్టం. మండుటెండలో షూటింగ్స్ చేయాల్సి ఉంటుంది. కానీ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఉండటం దేవుడిచ్చిన వరం.. చక్కగా ఏసీ రూమ్‌లో కూర్చుని మన పని మనం చేసుకోవచ్చు" అని వ్యాఖ్యానించారు.ఇక దేవి శ్రీ ప్రసాద్ హీరోగా చేయబోయే సినిమాపై తమన్ గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఆ సినిమా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందని జోస్యం చెప్పారు. ఈ ప్రాజెక్ట్ గురించి నిర్మాత దిల్ రాజు ఇప్పటికే తనతో చర్చించారని.. అవసరమైతే దేవి సినిమా కోసం తాను రెండు లేదా మూడు పాటలు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తమన్ ప్రకటించారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే మంచి సినిమాలు వస్తాయి" అంటూ తోటి సంగీత దర్శకుడిపై తమన్ చూపించిన ఈ స్నేహపూర్వక మద్దతుకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న బాండింగ్‌ను చూసి ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఆయన నటన గురించి మాటల్లో చెప్పలేను

: సంయుక్త మీనన్

మలయాళం, తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నటి సంయుక్త మీనన్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనతో కలిసి 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' చిత్రంలో నటిస్తున్న ఆమె, విజయ్ నటనను ప్రత్యక్షంగా చూడటం ఒక అద్భుతమైన అనుభూతి అని తెలిపారు. ఆయన సెట్‌లో ఉన్నప్పుడు, తెరపై చూసేదానికంటే భిన్నమైన శక్తిని తీసుకొస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. విజయ్ సేతుపతితో కలిసి పనిచేయడం గురించి సంయుక్త మాట్లాడుతూ, "నేను విజయ్ సర్‌కు పెద్ద అభిమానిని. ఆయన నటనను దగ్గర నుంచి చూడటం మాటల్లో చెప్పలేను. ఒక పాత్రలోకి ఆయన మారే తీరు చాలా సహజంగా ఉంటుంది. డైలాగ్స్ చెబుతుంటే, అవి నిజంగా తనలో నుంచే వస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక సహనటిగా ఆ ప్రక్రియను చూడటం నాకు దక్కిన అదృష్టం" అని వివరించారు. 'స్లమ్‌డాగ్' చిత్రంలో తన పాత్ర గురించి చెబుతూ, "ఇందులో నా పాత్ర చాలా అందమైనది, ఎన్నో విభిన్న కోణాలు ఉంటాయి. నటిగా ఇది నాకు ఒక పెద్ద సవాల్. ఇలాంటి ప్రత్యేకమైన పాత్ర చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది" అని సంయుక్త మీనన్ అన్నారు. ఈ చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్ పనితీరును కూడా సంయుక్త మెచ్చుకున్నారు. "పూరి సర్ దర్శకత్వం చేసే విధానం చాలా స్టైలిష్‌గా, అందంగా ఉంటుంది. ఆయన సమయానికి షూటింగ్ మొదలుపెట్టి, అనుకున్నదానికంటే ముందే పూర్తి చేస్తారు. ఆయన పనితీరు చూడటం ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది" అని తెలిపారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది.

జాన్వీ కపూర్ ని ఇబ్బంది పెట్టడం సరికాదు

: జగపతిబాబు

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో భారీ అంచనాలతో విడుదలైన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద మూడు రోజుల్లోనే రూ.236 కోట్లు వసూలు చేసి ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమాలో 'అప్పలసూరి' పాత్రలో మెప్పించిన సీనియర్ నటుడు జగపతిబాబు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్ర, ఆమెపై వస్తున్న ట్రోల్స్‌పై స్పందిస్తూ ఆమెకు పూర్తి మద్దతు ప్రకటించారు.సినిమాలో జాన్వీ కపూర్ పోషించిన క్యారెక్టర్‌పై వస్తున్న విమర్శలపై జగపతిబాబు తీవ్రంగా స్పందించారు. "సినిమా విషయంలో ఆర్టిస్టులను అనవసరంగా ట్రోల్ చేయొద్దు. పాపం ఆ అమ్మాయి (జాన్వీ కపూర్) దర్శకుడు తనకు ఏం చెప్పాడో, ఎలా చేయమన్నాడో అలాగే చేసింది. కొన్నిసార్లు క్యారెక్టరైజేషన్ అనుకున్నట్లు రాక మిస్ ఫైర్ అవ్వచ్చు. అంత మాత్రాన ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి, ట్రోల్స్ చేస్తూ మానసికంగా ఇబ్బంది పెట్టడం కరెక్ట్ కాదు. ఈ విషయంలో నేను కచ్చితంగా జాన్వీకపూర్‌కే సపోర్ట్ చేస్తాను" అన్నారు. తన పాత్ర గురించి మాట్లాడుతూ... "మధ్యలో నేను ఎన్ని సినిమాలు చేసినా, 'పెద్ది' విడుదల కోసమే ఎంతగానో ఎదురుచూశాను. ఈ సినిమా కోసం నేను ప్రాణం పెట్టి పనిచేశాను. రూ.300 కోట్లు పెట్టి సినిమా తీసినా, థియేటర్లలో రూ.300 పెట్టి టికెట్ కొనే ప్రేక్షకుల చేతుల్లోనే ఇండస్ట్రీ తలరాత ఉంటుంది" అని జగపతిబాబు వ్యాఖ్యానించారు. షూటింగ్ సమయంలో ప్రతి షాట్‌కు క్లాప్స్ కొట్టిన టీమ్... సినిమా విడుదలయ్యాక తన పాత్ర గురించి ఎందుకు మాట్లాడటం లేదని డైరెక్టర్ బుచ్చిబాబును అడిగినట్లు జగపతిబాబు వెల్లడించారు. "సినిమా విడుదలయ్యాక నాకు ఒక పెద్ద డైరెక్టర్ ఫోన్ చేసి.. 'ఇంత గొప్ప పాత్ర చేసినా మిమ్మల్ని ఎందుకు గుర్తించట్లేదు? ఇదే పాత్రను వేరే భాష నటుడు చేసి ఉంటే 20 సినిమాలు ఆఫర్ చేసేవారు' అని అన్నారు. ఏ ఇండస్ట్రీలో అయినా పరభాష నటులకే ఎక్కువ గౌరవం ఇస్తారు. నేను కన్నడలో చేసినా నాకు అక్కడ మంచి గౌరవం లభిస్తుంది. 'పెద్ది' చిత్రానికి ఇంకా ఎక్కువ ఆదరణ దక్కాలి, కచ్చితంగా దక్కుతుంది. ఇందులో పనిచేసిన ప్రతిఒక్కరూ భవిష్యత్తులో గర్వంగా ఫీల్ అవుతారు" అని అన్నారు.

'రామాయణ'లో కీలకపాత్ర .. అధికారికంగా వెల్లడించిన కాజల్

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రామాయణం'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి కాజల్ అగర్వాల్ స్పష్టతనిచ్చారు. ఈ భారీ ప్రాజెక్టులో తాను భాగమైనట్లు ఆమె ధృవీకరించారు. ఇటీవల జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఈ చిత్రం కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ, "భారతదేశంలో ఇంతకుముందెన్నడూ చూడని అద్భుతమైన సాంకేతిక హంగులతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇది నా కెరీర్‌లో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు.'రామాయణం'లో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తున్నారు. వీరితో పాటు హనుమంతుడి పాత్రను సన్నీ డియోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనుండగా, తొలి భాగాన్ని 2026 దీపావళి కానుకగా, రెండో భాగాన్ని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.

నిర్మాతగా మారిన నాగచైతన్య..

కీలక పాత్రలో భూమిక చావ్లా

అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'దూత' సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల 'దూత-2' పూజా కార్యక్రమాలతో పాటు షూటింగ్ కూడా అధికారికంగా ప్రారంభమైంది. ఈ వేడుకకు నాగార్జున ముఖ్య అతిథిగా విచ్చేసి క్లాప్ కొట్టారు. ఈ సిరీస్ ద్వారా నాగచైతన్య సరికొత్తగా నిర్మాత అవతారమెత్తడం విశేషం. చైతన్య నిర్మిస్తున్న తొలి ప్రాజెక్ట్ ఇదే. అమెజాన్ ప్రైమ్ వీడియోలో రాబోతున్న ఈ సీజన్‌కు కూడా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.ఫస్ట్ సీజన్‌లోని పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ ఈసారి కూడా అలరించనున్నారు. కాగా, ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో ప్రముఖ నటి భూమిక చావ్లా ఒక కీలక పాత్రలో నటిస్తోంది. గతంలో వీరిద్దరూ 'సవ్యసాచి' (2018) లో కలిసి నటించారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

షోల్డర్ లెస్ అందాలతో గత్తర లేపుతున్న పవన్ కళ్యాణ్ హీరోయిన్!



ఈ క్రమంలోనే తాజాగా మరో లేటెస్ట్ ట్రెండీ ఔట్‌ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. షోల్డర్ లెస్ ఫ్రాక్ ధరించి తన అందాలతో మరింత హొయలు పోయింది. ప్రముఖ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన యాక్షన్ ఓరియెంటెడ్ చిత్రం ఓజీ. ఈ సినిమాలో కన్మణి పాత్రతో పవన్ కళ్యాణ్ సరసన తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది ప్రియాంక మోహన్. ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ హీరోయిన్ గా మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. అలాంటి ఈ ముద్దుగుమ్మ ఒకవైపు వరుస సినిమాలలో అవకాశాలు అందుకుంటూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే ఎప్పటికప్పుడు ఒకవైపు ట్రెడిషనల్ గా మరొకవైపు గ్లామర్ టచ్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా ఆకర్షిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా మరో లేటెస్ట్ ట్రెండీ ఔట్‌ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. షోల్డర్ లెస్ ఫ్రాక్ ధరించి తన అందాలతో మరింత హొయలు పోయింది. ఖారా కపాస్ బ్రాండ్ కి చెందిన ఎల్ వేర్ ఫాల్ 25 కలెక్షన్స్ నుండి ఎంపిక చేసిన స్ట్రక్చర్డ్ ఆక్స్‌ఫర్డ్ కాటన్ తో డిజైన్ చేసిన నుబ్రా మ్యాక్సీ డ్రెస్ ధరించి తన డ్రెస్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. మిరమిట్లు గొలిపే ఎరుపు రంగు పూల ప్రింట్లతో డిజైన్ చేసిన ఈ షోల్డర్ లెస్ బ్లాక్ కలర్ మ్యాక్సీ డ్రెస్ ఈమె అందాన్ని ప్రకటింపు చేసింది. ఇకపోతే ఈమె ధరించిన ఈ డ్రెస్ మార్కెట్ రేటు ప్రకారం సుమారుగా రూ.9,770 నుండి రూ.10,855 మధ్య ఉంటుంది. డ్రై క్లీన్ మాత్రమే చేయగలిగే ఇలాంటి లేటెస్ట్ ఔట్‌ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. మొత్తానికి అయితే ప్రియాంక షేర్ చేసిన ఈ లేటెస్ట్ అవుట్ ఫిట్ చూపరులను విపరీతంగా అలరిస్తోంది. ఇకపోతే ఈ మధ్యకాలంలో ప్రియాంక మోహన్ రేంజ్ గ్లోబల్ స్థాయికి పాకి పోయిందని చెప్పాలి. వరుసగా పలు చిత్రాలు చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న ఈమెను కొరియా టూరిజం ఆర్గనైజేషన్ కొరియా టూరిజంకి గౌరవ రాయబారిగా నియమించింది. ముఖ్యంగా కొరియన్ సంస్కృతిని అనుభవ పూర్వక ప్రయాణాలను ప్రోత్సహించడానికి, సౌత్ ఇండియాలో ప్రియాంక మోహన్ కి ఉన్న ప్రజాదారణను ఉపయోగించుకొని.. కొరియా టూరిజంను అభివృద్ధి చెందించడం కోసం దక్షిణ కొరియా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ ఎంపిక ఈమె నటించిన క్రాస్ కల్చరల్ నెట్ ఫ్లిక్స్ ప్రాజెక్ట్ మేడ్ ఇన్ కొరియా తర్వాతే ఇండియా -దక్షిణ కొరియా మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి జరిగినట్లు సమాచారం. కొల్లూరులో 3 & 4 దీనఖ కొత్తగా ప్రారంభించబడినవి కొల్లూరులో, ూ==కు చక్కటి అనుసంధానమున్న కొత్తగా ప్రారంభించబడిన గృహాలు. ఒక ప్రసిద్ధ డెవలపర్ వారిచే 3 & 4 దీనఖ అపార్ట్‌మెంట్లు. గచ్చిబౌలి, హైటెక్ సిటీ, తెల్లాపూర్ & కోకాపేట్‌లకు సమీపంలో. ూతీవర్ఱస్వవ ఖశీశ్రీశ్రీబతీ ఇక ప్రియాంక మోహన్ చిత్రాల విషయానికి వస్తే.. మేడ్ ఇన్ కొరియా తరువాత తమిళ యాక్షన్ చిత్రం అరసన్ తో పాటు కన్నడ ప్రాజెక్టు 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ వంటి చిత్రాలలో ఈమె నటిస్తోంది.

అదరగొట్టావ్ చరణ్.. 'పెద్ది' మైండ్‌బ్లోయింగ్ అంతే..: అల్లు అర్జున్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా వచ్చిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'. ఈ సినిమాను తాజాగా వీక్షించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, చిత్ర బృందంపై ప్రశంసల వర్షం కురిపించారు. ముఖ్యంగా రామ్ చరణ్ నటన అద్భుతమంటూ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "నిన్న రాత్రి 'పెద్ది' చూశాను. నా ప్రియమైన రామ్ చరణ్ నటన మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. గ్రిట్టీ, రా పెర్ఫార్మెన్స్‌తో పాటు అసాధారణమైన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ మూవ్స్‌తో ప్రతి అంశంలోనూ అదరగొట్టాడు. నా సోదరుడిని చూసి నిజంగా చాలా గర్వపడుతున్నాను. ఈ ప్రశంసలకు అతను అన్ని విధాలా అర్హుడు" అని అల్లు అర్జున్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.
ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు నటన అద్భుతమని కొనియాడారు. అలాగే, హీరోయిన్ జాన్వీ కపూర్‌తో పాటు ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు, నిర్మాతలకు అభినందనలు తెలిపారు.దర్శకుడు బుచ్చిబాబు సానాపై ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. "ప్రతి ఒక్కరి నుంచి అద్భుతమైన నటనను రాబట్టి, చరణ్‌ను అత్యున్నత స్థాయిలో నిలబెట్టిన కెప్టెన్ బుచ్చిబాబు గారికి నా ప్రత్యేక అభినందనలు" అని పేర్కొంటూ 'పెద్ది' చిత్ర బృందం మొత్తానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లు అర్జున్ ప్రశంసలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.